## డీజీపీ రవిగుప్తా డీపీతో ఫేక్ కాల్స్

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర డీజీపీ రవిగుప్తా డీపీతో పాకిస్తాన్‌కు చెందిన ఓ సైబర్ నేరగాడు +92 కోడ్‌తో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్తకు, అతని కుమార్తెకు వాట్సాప్ కాల్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. తాను అడిగగినంత ఇవ్వకపోతే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని బెదరింపులకు పాల్పడ్డాడు. సైబర్ నేరాలపై వారికి అవగాహన ఉండటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసును విచారిస్తున్నారు.

## బీజేపీపై కాంగ్రెస్ పోరాడాలి: సీపీఐ

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం బీఆర్ఎస్‌పై కాదని, బీజేపీపై చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి మాట్లాడారు. బీజేపీపై పోరాటంలో కాంగ్రెస్ తమిళనాడు సీఎం స్టాలిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం సన్న వడ్లకే బోనస్ ఇస్తామనడం సరైంది కాదని చెప్పారు. ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ అభ్యర్థికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. బెంగళూరులో రేవ్ పార్టీకి డ్రగ్స్ ఎలా వచ్చాయో మీడి యా దృష్టి సారించాలని సూచించా రు.

## 'రేవ్‌పార్టీలో 101 మంది గుర్తింపు'

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : బెంగళూరు రేవ్‌పార్టీలో 101 మందిని గుర్తించినట్లు బెంగళూరు నగర కమిషనర్ దయానంద వెల్లడించారు. మంగళవారం ఆయన బెంగళూరులో మాట్లాడు తూ.. ఈ నెల 19న జరిగిన రేవ్‌పార్టీపై పక్కా సమాచారంతో పోలీసులు దాడులు చేసినట్లు తెలిపారు. ఏపీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి చెందిన ఎమ్మెల్యే పాస్‌తో ఉన్న వాహనం దొరికినప్పటికీ అందులో మంత్రి గాని, అతని సన్నిహితులు గాని లేరని స్పష్టం చేశారు. ఓ నటి పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామని పేర్కొన్నారు.

# మత్స్యకారుల వివాదాలపై కమిటీ

- 3 నెలల్లోపు నిపుణులతో ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): మత్స్యకారులైన బెస్త, ముదిరాజ్ తెగల మధ్య వివాదాల పరిష్కారానికి 3 నెలల్లోగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ఇచ్చే నివేదికను పరిశీలించి 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బెస్త, బోయి, గంగపుత్ర, గూండ్ల తెగలవారిని మత్స్యకారులుగా పరిగణనలోకి తీసుకోకపోవడంపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని లేనిపక్షంలో ఈ అంశాన్ని బీసీ కమిషన్‌కు సిఫార్సు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ భీమపాక నగేశ్ ఇటీవల విచారణ జరిపారు. వాటితోపాటు బెస్త, బోయి, గూండ్ల, గంగపుత్రలతో కూడిన మత్స్యకారుల సహకార సంఘాల్లో తమకు సభ్యత్వం ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ ముదిరాజ్, ముతరాసి, తెనుగోళ్లు తదితర తెగలు దాఖలు చేసిన 26 పిటిషన్లపై విచారణ జరిపి పై ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సహకార సంఘాల చట్టం కింద మత్స్యకారులు సంఘాలుగా ఏర్పడటానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో బెస్త, బోయి, గంగపుత్ర, గూండ్ల తెగలవారు సొసైటీలుగా ఏర్పాటై చెరువుల్లో చేపలు పట్టేందుకు లీజు హక్కులు పొందారు. తామే నిజమైన మత్స్యకారులమని.. ముదిరాజ్, ముతరాసి, తెనుగోళ్లు 'బీసీ-డీ' క్యాటగిరీకి చెందినవారు, వారు తోటపనివారుగా గుర్తింపు పొందారని బెస్త తెగలవారు చెప్తున్నారు. 1964లో జారీ అయిన జీవో 98 ప్రకారం గంగపుత్ర, ముతరాసిలతోపాటు 29 తెగలు చేపలు పట్టుకోవచ్చని, అందువల్ల తాము కూడా సొసైటీలో సభ్యత్వానికి అర్హులమని ముదిరాజ్, ముతరాసి తెగలవారు వాదిస్తున్నారు. ఈ రెండు వర్గాల మధ్య వివాదం ముదరడంతో ఒక్కో పక్షం నుంచి 10 మంది చొప్పున మొత్తం 20 మందితో గతంలో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. 2021 ఆగస్టు, సెప్టెంబర్‌లో ఈ కమిటీ మత్స్యశాక మంత్రితో సమావేశమైంది. బెస్త, బోయి, గూండ్ల తెగలతో ఉన్న ప్రస్తుత సొసైటీల్లో సభ్యత్వంపై ఎలాంటి మార్పు ఉండరాదని ఈ భేటీలో నిర్ణయించారు. ఈ తెగలు లేనిచోట ఇతర తెగలవారు సొసైటీ ఏర్పాటు కోసం వస్తే పరిశీలించాలని తీర్మానించారు. ఈ తీర్మానాల ప్రకారం మత్స్యశాఖ కమిషనర్ 2021లో మెమో జారీ చేశారు. ఈ మెమో ప్రకారం జిల్లా అధికారులు 800 సొసైటీలను రిజిస్టర్ చేశారు. ఈ నేపథ్యంలో ముదిరాజ్‌ల తరపున డీఎల్ పాండు, బెస్త తెగలవారి తరపున విద్యావతి హైకోర్టులో వాదనలు వినిపిస్తూ.. నిపుణుల కమిటీ ఏర్పాటుకు అభ్యంతరం లేదని చెప్పారు. దీంతో 3 నెలల్లోగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులకు జస్టిస్ భీమపాక నగేశ్ ఆదేశాలు జారీ చేశారు.

# 'రియల్' చెర వీడిన రంగసముద్రం

- ఎట్టకేలకు స్పందించిన నీటిపారుదల శాఖ
- ముమ్మరంగా కత్వా, ఫీడర్ చానల్ పునరుద్ధరణ పనులు
- కోడ్ ముగిసిన తర్వాత మరిన్ని నిధులతో పనులు

నమస్తే ఎఫెక్ట్


రంగారెడ్డి జిల్లా గిరికొత్తపల్లిలోని రంగ సముద్రం చెరువులో పనులు చేపడుతున్న రైతులు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మే 21 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామానికి ఆదరువైన రంగ సముద్రం చెరువుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. రియల్ వలలో చిక్కుకుని ఉనికి కోల్పోవడంతో గ్రామ పరిధిలో తాగు, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో రైతులు చాలాకాలంగా చెరువుకు పూర్వ వైభవం తెచ్చేందుకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ క్రమంలో నమస్తే తెలంగాణ 'రియల్ వలలో రంగ సముద్రం విలవిల' శీర్షికన సమస్యను వెలుగులోకి తెచ్చింది. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి చెరువు పునరుద్ధరణకు చేపట్టాల్సిన పనులపై గతంలోనే సర్వే నిర్వహించారు. వర్షాలు మొదలైన దరిమిలా ప్రస్తుతం నీటిపారుదల శాఖ అధికారులు వాగు, ఎగువ ప్రాంతం నుంచి చెరువులోకి వరద వచ్చేలా ప్రాథమిక పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. గిరికొత్తపల్లి రైతు సంక్షేమ సంఘం వారే పనులు చేపట్టేందుకు అనుమతిచ్చారు. దీంతో మూడు రోజుల కిందట కత్వా, ఫీడర్ చానల్ పనులు మొదలయ్యాయి. ఫీడర్ చానల్ పొడవునా పేరుకుపోయిన చెట్లను తొలగించి, చెరువులోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా పనులు పూర్తి చేశారు. ధ్వంసమైన కత్వాను పునరుద్ధరిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే దాదాపు ఏడెనిమిది ఏండ్ల తర్వాత చెరువులోకి వరద నీరు రానున్నది. కోడ్ ముగిసిన తర్వాత చెరువు కట్ట బలోపేతంతో పాటు ఇతరత్రా పనులు చేపట్టనున్నారు.

## బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై మహిళల దాడి

### మిర్యాలగూడ బస్టాండ్‌లో ఘటన

మిర్యాలగూడ, మే 21: బస్సు ఆపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ ఘటన మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మిర్యాలగూడకు వస్తున్న సమయంలో.. అంగడిపేట స్టేజీ వద్ద కొంతమంది మహిళలు బస్సు ఎక్కేందుకు ఆపారు. డ్రైవర్ మహిళలు ఉన్నచోట కాకుండా కొద్ది దూరం వెళ్లాక బస్సును ఆపడంతో మహిళల్లో కొద్ది మంది పరిగెత్తుకెత్తుకుంటూ వచ్చి ఎక్కారు. ఈలోగా డ్రైవర్ బస్సును కదిలించడంతో బస్సు ఎక్కిన మహిళలు తమవాళ్లు వస్తున్నారని, బస్సు ఆపాలని కోరారు. దాంతో వెనుక మరో బస్సు వస్తున్నదంటూ బస్సును ముందుకు నడుపడంతో బస్సు ఎక్కిన మహిళలు కూడా కిందికి దిగారు. అందరూ కలిసి వెనుక వచ్చిన మరో బస్సులో మిర్యాలగూడ బస్టాండ్‌కు చేరుకున్నారు. డ్రైవర్‌ను గుర్తించి అతనిపై మహిళలు చేయిచేసుకున్నారు. డ్యూటీలో ఉన్న తనను కొట్టారంటూ డ్రైవర్ మహిళలపై కేసు పెట్టాడు. విషయం తెలుసుకున్న మహిళలు.. డ్రైవర్ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ డ్రైవర్‌పై కేసు పెట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువురితో చర్చించి రాజీ కుదిర్చారు.

## సీఈఐఆర్‌లో తెలంగాణకు రెండోస్థానం

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి బాధితులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) విధానంలో తెలంగాణ రాష్ట్రం రెండోస్థానంలో నిలిచినట్లు సీఐడీ ఇన్‌చార్జి ఏడీజీ మహేశ్ భగవత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ నుంచి 396 రోజుల్లో 30,049 ఫోన్లు కనుగొని బాధితులకు అప్పగించారని వెల్లడించారు. కాగా 35,945 ఫోన్ల రికవరీలతో కర్ణాటక మొదటిస్థానంలో ఉన్నట్టు పేర్కొన్నారు.



## బ్రాహ్మణకొత్తపల్లిలో కాకతీయ శాసనం

*మహబూబాబాద్ జిల్లా బ్రాహ్మణకొత్తపల్లిలో సంతాన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శాసనాన్ని తెలంగాణ వారసత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరంగాచార్యులు గుర్తించారు. ఇది రుద్రమదేవి కాలంలో చేసిన దాన శాసనమని నూతన తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్, రామోజు హరగోపాల్ వెల్లడించారు.*

- కాళీయమర్ధనుడిగా యాదగిరీశుడు


యాదగిరిగుట్ట నృసింహుడి జయంత్యుత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు మంగళవారం ఉదయం స్వామి వారిని కాళీయమర్ధనుడిగా అలంకరించి ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. –యాదగిరిగుట్ట

## సీఎంవోలో కోడ్ ఉల్లంఘనలు

- రాజీవ్‌గాంధీ వర్ధంతికి సీఎం రేవంత్ హాజరైన వీడియో పోస్టు
- ఈసీ, సీఎస్‌కు డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ ఫిర్యాదు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) అధికారిక సోషల్ మీడియా హ్యాండిళ్ల ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న రాజీవ్‌గాంధీ వర్ధంతి లాంటి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సైతం ఆ హ్యాండిళ్లలో పోస్టు చేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ ఎన్నికల సంఘంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫిర్యాదు చేశారు. అనంతరం తన ఫిర్యాదుపై 'ఎక్స్' ద్వారా సుదీర్ఘ వివరణ ఇచ్చారు. 'సీఎంవో అధికారిక సోషల్ మీడియా హ్యాండిళ్ల ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్న విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి అధికారిక సోషల్ మీడియా హ్యాండిళ్లలో ఎలాంటి అప్‌డేట్‌లు లేదా ఫోటోగ్రాఫ్‌లు/వీడియోలను పోస్ట్ చేయకూడదు. కానీ, ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఈ ఉల్లంఘనలకు బాధ్యులైన అధికారులపై ఎన్నికల సంఘం, సీఎస్ కఠిన చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల అమలులో ఉన్నందున సీఎంవో సోషల్ మీడియా హ్యాండిళ్లలో ఇటీవల పోస్టు చేసిన అన్ని అప్‌డేట్‌లను తక్షణమే తొలగించడంతోపాటు జూన్ 5 వరకు వాటిలో ఎలాంటి అప్‌డేట్‌లు పోస్టు చేయకుండా చూడాలి' అని దిలీప్ ఆ వివరణలో పేర్కొన్నారు.

## తక్కువ ధరకే బంగారం.. 4 కోట్లకు టోపీ

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామంటూ పలువురి నుంచి రూ. 4 కోట్లు వసూలు చేసిన ముగ్గురు స్నేహితులపై సీసీఎస్‌లో కేసు నమోదైంది. విశాల్, వినయ్, అఖిల్ ముగ్గురు స్నేహితులు కలిసి తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామంటూ గోల్డ్‌స్కీమ్ ఏర్పాటు చేశారు. ఇందులో రూ. 50 వేలతో చేరితో బంగారం మార్కెట్ రేట్ కన్నా 10 శాతం తక్కువకు వస్తుందంటూ డిపాజిట్లు సేకరించారు. ఆ తరువాత దీనిని చైన్ సిస్టమ్‌లా మార్చేశారు. మొదటి గోల్డ్ స్కీమ్‌లో పెట్టుబడి పెట్టిన వాళ్లకు లాభం వచ్చిందంటూ నమ్మిస్తూ కొంత డబ్బులు తిరిగి ఇస్తూ నమ్మకం కుదుర్చుకున్నారు. దీంతో చాల మంది స్కీమ్‌లో చేరగా రూ. 4 కోట్ల వరకు వసూలు చేసి పరారయ్యారు. రామంతాపూర్‌కు చెందిన బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ):రాష్ట్రంలో 60 శాతం దొడ్డు వడ్లను పండిస్తున్న రైతాంగాన్ని దృష్టిలోకి తీసుకొని క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. వానకాలం సీజన్‌లో సన్నవడ్లకు రూ.500 బోనస్ ప్రకటించడం హర్షణీయమన్నారు.


